


12



వంగూరి చిట్టెన్ రాజు

# అమెరికాలక్షేపం

## తెలుగు వాళ్ళూ, టెలీ మార్కెటింగూ

ఈ మధ్యనే నేను నా బ్రిలియంట్ మార్కెటింగ్ బుర్ర ఉపయోగించి ఒక రహస్యం కనిపెట్టాను. అదేమిటంటే, ఈ రోజుల్లో అందరూ తరుచు ఉపయోగించే టెలీ మార్కెటింగ్ అనే మాటలో ఉన్న "టెలీ" అనే మాటకి ఒరిజినల్ మాట "తెలుగు" అనీ, కానీ నోరు తిరగని ఈ అమెరికన్ మార్కెటింగ్ గాళ్ళు దాన్ని స్వచ్ఛమైన "తెలుగు" అని పలకలేక, ముందు తెలేగూ అని అనడానికి నానా అవస్థలూ పడి, అదీ పలక లేక "టెలీ" అని కుదించారనీ నా ప్రగాఢ విశ్వాసం. అంటే "పంది కొక్కు" అనే స్వచ్ఛమైన తెలుగు మాటని "బేండీకూట్" అనే పద్ధతిలో అన్న మాట. నేను ఇంత పకడ్బందీగా పరిశోధన చేయడానికీ, ఇంతటి చారిత్రాత్మకమైన నిర్ణయానికి రావడానికీ ముఖ్య కారణం కిందటి వారం జరిగిన ఒక చిన్న.. చిన్న ఏమిటీ లెండి పెద్ద విశేషమే!

ఆ రోజు తెల్లారగట్ట నాలుగో, ఐదో అయింది. యధా ప్రకారం అప్పటికి గంటన్నర క్రితమే నిద్రపోతున్న నన్ను మనసారా జల్ల కొట్టి మా ఆవిడ ఉద్యోగానికి వెళ్ళిపోయింది. మీరు గమనించారో లేదో, దొరలూ, దొరసానులూ, చిన్నా, లేదా, పెద్దా ముద్దులతో వీడ్కోలు చెప్పుకుంటే, మన వాళ్ళు, చిన్నా, లేదా పెద్ద టెంకు జల్లలతో వీడ్కోలు చెప్పుకుంటారు...కానీ ఆ మాట ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడతారు... మా ఆవిడ నిశాచరి, అనగా, అర్ధరాత్రే తప్ప, పట్ట పగలు ఆవిడ బుర్ర పనిచెయ్యదు. అందు వలన పగలు ఉద్యోగం చెయ్యదు, చెయ్యలేదు. పూర్వ జన్మలో మా ఆవిడ అందమైన గబ్బిలమో, మధ్య ప్రదేశ్ అరణ్యాలలో గజ దొంగో అని నా అనుమానం.

ఫోన్ మోగగానే యధాప్రకారం సదరు మా శ్రీమతి, లేదా పగలు నిద్ర పోయి రాత్రుళ్ళు మాత్రమే కారులో షికారు కెళ్ళే మా పాల బుగ్గల పసిడి చానలు, అంటే టీనేజ్ కూతుళ్ళు కానీ వాళ్ళ కారులో గాస్..అనగా పెట్రోలు అయిపోవడమో, ఎక్కడో సరదాగా దేన్నో గుద్దేయడమో జరిగిందనుకుని, ఫోన్ తీసి "ఈ సారి ఏమయింది" అన్నాను.

"హలో సార్, గుడ్ మార్నింగ్, ఎలా ఉన్నారు" అడిగింది, ఆడో, మొగో తెలియని ఒక తెలుగు గొంతుక.

" ఏదో, పరవా లేదు, కాస్త మగతగా ఉంది కానీ జీవితం బాగానే గడుస్తోంది. ఇంతకీ తమరెవరూ?" అన్నాను, మా కుటుంబంలో ఎవరూ కారు ఏక్సిడెంట్ చేసి జైలులో లేరోచ్ అని తెలియగానే.

"నాపేరు బబ్బా అండ్ అయాం ఫ్రం..."

"ఎవరూ, బబ్బాయా?"

"ఆయ్యె, దిస్ ఈజ్ బబ్బా ఫ్రం చేగోడీ టెలీకమ్యూనికేషన్స్ కంపెనీ, అంబాజీ పేట, అమలాపురం తాలూకా, తూ.గో జిల్లా, ఆంధ్ర ప్రదేశ్, ఇండియా, ఆయ్యె"

" బబ్బా ఫ్రం అంబాజీ పేటా? బాబూ, అంబాజీ పేటలో ఉంటూ, ఈ బబ్బా, గిబ్బా ఏమిటీ మా టెక్సస్ కాబోయ్‌లాగా? ఈ టైములో, మా ఊళ్ళో ఇప్పుడు గుర్రాలు కూడా ఇంకా నిద్ర లేచే టైం అవలేదు. పైగా ఇవాళ శనివారం. అమెరికాలో టెలుగూస్ దున్న పోతులా పడుకునే సమయం. అయినా పని కట్టుకుని ప్రేమగా పిలిచావంటే ఏదో ముఖ్యమైన పనే అయి ఉంటుంది. నువ్వెవరూ, ఇక్కడ ఏమన్నా కాలేజీలకి అప్లై చేశావా, లేక తానా సభలకి రావడానికి దొంగ వీసా ఇన్విటేషన్ కావాలా" అన్నాను ఆ డిపార్ట్‌మెంట్లలలో చాల అనుభవం ఉన్నవాణ్ణి కాబట్టి.

నా గొంతుకలో ఎలాటి ఆశాభావం వినిపించిందో తెలియదు కానీ. "భలే వారే, అదేం కాదు సార్, మీరు రోజూ ఇండియా ఫోన్ చేస్తారు కదా, ఏ టీ అండ్ టీ, లేదా, ఈ కాఫీ అండ్ ఆ కాఫీల కంటే అతి తక్కువ ఖర్చు అయే మా చేగోడీ టెలీ కమ్యూనికేషన్ కంపెనీ వారితో అకౌంట్ ఓపెన్ చెయ్యండి సార్. మీరు ఇండియాలో ఎక్కడ, ఎవరికి, ఏ టైములో, ఏ సబ్జెక్టు మీదైనా, ఆడా, మగా మరియు ఇతరులతో కాని, తిడుతూ కాని, తిట్లు తింటూ కాని మీరు ఇండియా ఫోన్ చెయ్యచ్చు. అంతకంటా ముఖ్యం, ఇప్పుడు అమెరికాలో కూడా మన తెలుగు సోప్‌లు, అంటే సీరియల్ డ్రామాలు వస్తున్నాయి కాబట్టీ, అవి మీ ఊళ్ళో ప్రసారం అవడానికి 12 గంటలు ముందే ఆంధ్రాలో అందరూ చూస్తారు కాబట్టి, ఒక వేళ మీరు కానీ, ముఖ్యంగా మీ శ్రీమతి గారు కానీ ఆ సస్పెన్సు భరించ లేక టీవీ సీరియల్ లో వచ్చే తరవాతి ఎపిసోడ్ వివరాల గురించి తెలుసుకోడానికి ఇండియా ఫోన్ చేయదలుచుకుంటే, మా ప్రణాళిక అద్భుతమైన అవకాశం. అలాగే ఆ రోజే విడుదల అయిన తెలుగు సినిమా అంతకు ముందు రోజు విడుదల అయిన సినిమా కంటే ఎంత చెత్తగా ఉందో తెలుసుకోడానికి కానీ..." అని టక, టకా చేగోడీ కుర్రాడు ఘంటసాల బాబులా పాట మొదలెట్టాడు.

అప్పుడు నాకు స్పష్టంగా తెలిసింది ఈ ఫోన్ కాల్ పవిత్ర భారత దేశం నుంచి, ఈ రోజుల్లో ప్రపంచ ప్రసిద్ధమైన ఏదో ఒక కాల్ సెంటర్ వారి కార్యాలయం నుంచి వచ్చింది సుమా అని. అది తెలియగానే " - ఆగాగు, ఆగాగు, ఏమంటివి, ఏమంటివీ" అన్నాను దాన, వీర, శూర కర్ణ సినిమాలో ధనుర్విద్యా ప్రదర్శనం సీనులో దుర్యోధనుడి పాత్రలో ఎన్.టీ. రామారావులా.

" ఏ టీ అండ్ టీ, లేదా, ఈ కాఫీ అండ్ ఆ కాఫీ లాటి మల్టినేషనల్ టెలిఫోన్ కంపెనీల కంటే అతి తక్కువ ఖర్చు అయే మా చేగోడీ టెలీ కమ్యూనికేషన్ కంపెనీ వారితో అకౌంట్ ఓపెన్ చెయ్యండి సార్. మీరు

ఇండియాలో ఎక్కడ, ఎవరికి, ఏ టైములో, ఏ సబ్జెక్టు మీదైనా, ఆడా, మగా మరియు ఇతరులతో కాని, తిడుతూ కాని, తిట్లు తింటూ కాని మీరు ఇండియా ఫోన్ చెయ్యచ్చు. అంతకంటా ముఖ్యం, ఇప్పుడు అమెరికాలో కూడా మన తెలుగు సోప్‌లు...... మీరు కానీ, ముఖ్యంగా మీ శ్రీమతి గారు కానీ సస్పెన్సు భరించ లేక" ....... మళ్ళీ పురాణ పఠనం మొదలు పెట్టాడు చేగోడీ గాడు నాకు చెముడేమో అనుకుని.
అప్పటికి నాకు విషయం అర్థమయి, ఆ కుర్రాడి మీద జాలి వేసింది.

"అలాగా బబ్బా గారూ, ఇంతకీ మీ చేగోడీ వారి రేటు ఎంతా?"

"అయ్యా, మా రేటండీ మామూలుగా అయితే నిమిషానికి పది సెంట్లండి. కానీ ఒక ఏడాది ఎడ్వాన్సు కడితే చేస్తే కేవలం ఎనిమిది సెంట్లండి... అంటే కేవలం నాలుగు రూపాయలండి ఇప్పటి రేటు ప్రకారం. మీరే చెప్పండి ఈ రోజుల్లో నాలుగు రూపాయలకి ఎన్.టీ.ఆర్ గారి జనతా టీ కూడా రాదండి. పైగా మీరు ఇండియాలో ఎక్కడ, ఎవరికి, ఏ టైములో, ఏ సబ్జెక్టు మీదైనా, ఆడా, మగా మరియు ఇతరులతో కాని, తిడుతూ కాని, తిట్లు తింటూ కాని...."

"ఓ, మొన్ననే పకోడీ ఫోన్ కంపెనీవారెవరో కూడా పిలిచినట్లున్నారు. ఇలాటి అతి ముఖ్యమైన ఆర్థిక వ్యవహారాలన్నీ మా ఆర్థిక మంత్రిగారు చూస్తారు. వారు ఇంకో గంటలో వస్తారు. వారితో నేను సంప్రదిస్తాను. సరేనా?" అన్నాను.

"తప్పకుండా సార్, మీరు సెపరేట్‌గా మీ వ్యవహారాలు చూడ్డానికి ఆర్థిక మంత్రిగారిని ఎపాయింట్ చేసుకున్నారంటే నాకు మహానందంగా ఉంది సార్. అందుకే అమెరికా అంటే మా అంబాజీ పేటలో అందరికీ అఖండమైన గౌరవం సార్. మీకు అభ్యంతరం లేకపోతే నేనే మళ్ళీ ఫోన్ చేసి మంత్రి గారితో మాట్లాడతాను సార్. ఇంతకీ మంత్రిగారి పేరేమిటి సార్.?" సవినయంగా అడిగాడు బబ్బా గారు.

"పేరెందుకులే, ఇంట్లో నేను లేకపోతే ఆవిడే ఫోన్ ఆన్సరు చేస్తుందిలే". అంటూండగా "అయ్య బాబోయ్, మీ ఆర్థిక మంత్రి గారు ఆడావిడా.....మీరు ఎంత ఎడ్వాన్సుడు సార్" అని చేగోడీగాడు ఇంకా ఏదో అనబోతుంటే అని ఫోన్ పెట్టేశాను....

నేను శనివారం కూడ పొద్దున్న ఆఫీసుకి వెడతాను కాబట్టి, మరొక గంటో, గంటన్నరో పక్క మీద అటూ, ఇటూ దొర్లి, మొత్తానికి లేచి, ఆఫీసుకి వెళ్ళడానికి తయారయి, శనివారం వంట చేయడం అమెరికా తెలుగు వారి ఇంటా, వంటా లేదు కాబట్టి ఆ రోజు లంచ్‌కి లెఫ్ట్ ఓవర్ కూరలూ, పులుసులూ ఉన్నాయా లేవా అని ఫ్రిజ్ అంతా వెతుకుతూ ఉంటే, మళ్ళీ ఫోన్ మోగింది. ఈ సారి మళ్ళీ బబ్బా గాడో , వాడి బాబో ఫోన్ చేసి ఉంటారనుకుని ఫోన్ తీశాను.

"ఓ మీరా అల్లుడు గారూ, మా అమ్మాయి ఇంట్లో లేదా, మీరు ఇంకా ఆఫీసుకి వెళ్ళ లేదా?" అని ప్రేమగా అడిగారు మా మామ గారు. తనంతట తను ఫోన్ చేయడమే కాక, రెండు వాక్యాలు కూడా సావకాశంగా మాట్లాడారంటే నాకు చాలా ఆశ్చర్యం వేసింది. పైగా, మా అమ్మాయిని ఉద్యోగానికి పంపించి, నువ్వు హాయిగా ఇంట్లో కూచున్నావా చవటా అనే ధ్వని కూడా వినపడింది ఆయన గొంతుకలో.

"అబ్బే, ఇప్పుడే బయలు దేరుతున్నాను. మీరు ఫోన్ పెట్టేయండి. నేను వెనక్కి పిలుస్తాను. " అన్నాను మా అలవాటు ప్రకారం. ఎందుకంటే, ఇండియా నుంచి అమెరికాకి ఫోన్ చేస్తే, అరగంటకి అర ఎకరం పొలం రాసిచ్చేయాలి ఫోన్ కంపెనీ వాళ్ళకి. అందుచేత మా ఆవిడకీ, ఆయనకీ రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా వాళ్లకీ, ఇంగ్లండు వాళ్ళకీ ఉన్న పద్ధతిలో ఒక రహస్యమైన టెలిఫోన్ కోడ్ ఉంది. అదేమిటంటే, ఆయన ఇండియా నుంచి, శనివారం పొద్దున్న అదే టైముకి ఫోన్ చేస్తారు. కానీ మా ఆవిడ ఫోన్ తియ్యదు. సరిగ్గా ఆరు రింగులు మోగి, ఫోన్ ఆగిపోతే అది మా మామ గారు ఇండియా నుంచి ఫోన్ చేసినట్టు లెఖ్ఖ అనమాట. అప్పుడు మా ఆవిడ కాలింగ్ కార్డు వాడి ఆయన్ని పిలుస్తుంది. ఈ ఏర్పాటు చాలా సంవత్సరాలనుంచీ నుంచి ఉంది మా ఇంట్లో.

"అబ్బే పరవాలేదు, అల్లుడు గారూ, మీకెందుకు అంత ఫోన్ బిల్లు, దండగ. నేనే మళ్ళీ పిలుస్తాను. మీకు తెలియదేమో, కిందటి వారం నుంచీ ఇండియాలో ఫోన్ రేట్లు బాగా తగ్గించేసారు. ఇప్పుడు బిల్లు నిముషానికి రెండు రూపాయలే. అరగంట మాట్లాడినా మహా అయితే మీ లెక్క ప్రకారం ఇంచుమించు డాలర్ అవుతుంది. అదే మీకైతే ఐదారు డాలర్లు అవుతుంది గదా. ఇది చెబ్దామనే ఫోన్ చేస్తున్నాను. ఇక నుంచీ, మీరు శనివారం ఇది వరకటి టైంకే, మా బదులు మీరు ఫోన్ చెయ్యండి. ఆరు రింగులు దాటగానే ఆపేస్తే, మీరు ఫోన్ చేసినట్టే తెలుస్తుంది కాబట్టి, అప్పుడు నేనే మీకు ఫోన్ చేస్తాను. మా అమ్మాయి ఇంటికొచ్చాక ఆరు రింగుల ఫోన్ చెయ్యమని చెప్పండి" అని ఫోన్ పెట్టేసారు. మా మామ గారు.

"అలాగేనండి, ఇన్నాళ్ళకి మీ ఫోన్ ఖర్చులు మీరే పెట్టుకుంటున్నారంటే మన ప్రధాన మంత్రి మన్మోహన్‌గారికో, రాజశేఖర రెడ్డి గారికో తప్పకుండా కృతజ్ఞతలు చెప్పుకోవల్సిందే మీ ముద్దుల కూతురికి ఈ శుభవార్త చెప్తాను లెండి" అన్నాను.

"అబ్బే అంత సీను లేదులే అల్లుడూ, ఇక్కడ మా అమ్మాయి ఎన్నారై ఎక్కౌంట్ ఉందిగా. అందులోంచి కడతానులే ఆ బిల్లు, లేకపోతే నువ్వేమన్నా అనుకుంటావు కదా, అందుకూ" అని ఫోన్ పెట్టేశారు మా బిలవడ్ మామ గారు. డబ్బు ఖర్చు పెట్టే విషయాలలో మా మామ గారిని బోల్తాకొట్టించే నా ఏడువేల నాలుగు వందల ముప్ఫై రెండో ప్రయత్నం కూడా ఘోర పరాజయం చవి చూడగానే నా మొహం మళ్ళీ వెల వెల పోయింది.

యధా ప్రకారం ఆఫీసుకి వెళ్ళి, మూడు గంటలు కాస్త సొంత సేవా, మరి కాస్త సంఘ సేవా చేసి పారేశి ఇంటికి వెళ్ళాను...,వీకెండ్ మధ్యాహ్నం భోజనం చేసి దున్నపోతులా పడుకునే నా అలవాటు కొద్దీ. నన్ను చూడగానే మా ఆర్ధిక మంత్రి "హలో హనీ, ఐ హేవ్ గుడ్ న్యూస్" అంది నా వెండి కంచం డైనింగ్ టేబుల్ మీద పెడుతూ. సాధారణంగా మా ఆవిడ "గుడ్ న్యూస్" అంటే నా గుండెలు గుబ గుబలాడతాయి. "సరే అదేమిటో చెప్పు" అన్నాను ఎందుకైనా మంచిదని డైనింగ్ కుర్చీకున్న హేండిల్స్ గట్టిగా వాటేసుకుని.

"ఏం లేదు మగడా, ఎప్పుడూ ఏడుస్తావుగా, మా నాన్నకి నేను చేసే ఫోన్ కాల్స్ మూలాన్న నీ ఆస్తి తరిగిపోతోంది అని. అందుకే అంబాజీ పేట నుంచీ పాపం, బబ్బాట అతని ముద్దుపేరు... ఇందాకా పిలిస్తే ఏడాది కాంట్రాక్టుకి నిముషానికి కేవలం నాలుగు రూపాయలకి మీ క్రెడిట్ కార్డుతో ఐదు వందల

డాలర్లు ఎడ్వాన్సు కట్టాను. లేకపోతే రేట్లు పెరిగిపోతాయిట. ఇంక మా నాన్నతో ఎంతసేపైనా మాట్లాడ వచ్చు, నీ వెధవ సణుగుడు ఇంక కట్టెయ్. ఇప్పుడే మా నాన్నని పిలిచి ఈ శుభ వార్త చెప్తాను. ఇక మనం ఇండియాలో ఎక్కడ, ఎవరికి, ఏ టైములో, ఏ సబ్జెక్టు మీదైనా, ఆడా, మగా మరియు ఇతరులతో కాని, తిడుతూ కాని, తిట్లు తింటూ కాని ...." అంటూ మా ఆవిడ ఫోన్ తీసుకుంది.

అదండీ సంగతి. ఈ మధ్య అమెరికానుంచి ఫోన్ చేస్తే అయ్యే ఖర్చు నిమిషానికి నాలుగు రూపాయలైతే, కంటే ఇండియా నుంచివాళ్ళే ఇక్కడికి ఫోన్ చేస్తే నిమిషానికి రెండు రూపాయలే. ఈ సంగతి అమెరికాలో మనందరికీ తెలిసే లోపుగానే ఈ టెలీ మార్కెటింగ్ వారు అందరిచేతా ఏడాది కాంట్రాక్టులు రాయించేసుకుని, క్రెడిట్ కార్డుల మీద డాలర్లు చార్జ్ చేసేసి వ్యాపారం చేస్తున్నారు. తెలుగు వాడి టెలీ మార్కెటింగ్ మూలాన ఓడలు బళ్ళు అవును. బళ్ళు ఓడలు అవును. ఇండియా, అమెరికాలలో ఏది బండి, ఏది ఓడ?



